జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం- ప్రజల కోసం
నల్లగొండ- సూర్యాపేట
యాదాద్రి భువనగిరి
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024 పేజీలు: 8

## చెరువుగట్టు జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో



నల్లగొండ ఫిబ్రవరి 13(ప్రజాజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం నార్కట్పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ శ్రీ శ్రీ జడల పార్వతి రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఏర్పాట్లని మంగళవారం ఆర్డీఓ ఎన్. రవి పరిశీలించారు. తెలంగాణలోని మరొక శ్రీశైల క్షేత్రం గా విరాలజీలుతున్న చెరువుగట్టు శ్రీశ్రీ జడల పార్వతి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేయుచున్న భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం జరగకుండా వాహనాలకు పార్కింగ్ స్థలము, టాయిలెట్స్, గెస్ట్ హౌస్ తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట ఎమ్మార్వో పద్మ, దేవస్థానం ఈవో నవీన్, ఆర్ ఐ తరుణ్, ఏఈఈ కిరణ్, తదితరులు లు ఉన్నారు.

# నల్లగొండలో కాంగ్రెస్ వినూత్న నిరసన



- కాళీ కుర్చీపై పింక్ కలర్ టవల్, కెసిఆర్ ఫోటో
- ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేసి కెసిఆర్ మోసపూరిత హామీలను వినిపించిన పార్టీ శ్రేణులు
- మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుమ్ముల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం
- కెసిఆర్ మోసపూరిత హామీలపై దుమ్మెత్తి పోసిన పార్టీ శ్రేణులు
- ఏ ముఖం పెట్టుకొని నల్లగొండకు వస్తున్నారని నిలదీత
- ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే జిల్లాలో అడుగు పెట్టాలని డిమాండ్
- కెసిఆర్వి అన్ని మోసపూరిత హామీలే: డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్

నల్లగొండ పిబ్రవరి 13(ప్రజాజ్యోతి): గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రభుత్వం జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేసిందని డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. నల్లగొండ లో కెసిఆర్ పాల్గొనే బహిరంగ సభను నిరసిస్తూ మంగళవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాళీ కుర్చీలో పింక్ టవాలు వేసి కెసిఆర్ ఫోటో పెట్టి గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను ఎండగడు తూ ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. కెసిఆర్ గోబ్యాక్ అంటూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ కెసిఆర్ వన్నీ దొంగ హామీలన్నీ విమర్శించారు. బీఆర్ఎస్ 10 సంవత్సరా లు అధికారంలో ఉండి శ్రీశైలం టన్నెల్ ను కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. డిండి ఎత్తిపోతల, పాలమూరు- రంగారెడ్డి, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయని కెసిఆర్ నల్లగొండలో అడుగుపెట్టే హక్కు లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలన్నీ ప్రజలు గ్రహించి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ..మిగతా 8లో

# నేడు ప్రేమికుల దినోత్సవం..

**ఇలా.. మొద'లవ్'తుంది**
**ప్రేమికుల రోజు ఎలా వచ్చిందంటే..**
**సమాజాభ్యున్నతికి ప్రేమా..? ఆకర్షణా..?**



నిడమానూరు,ఫిబ్రవరి13(ప్రజాజ్యోతి):గుండెనిండా దాచుకున్న ఆకాశమంత ప్రేమను, మాటల్లో చెప్పలేని అనంతమైన భావాలను వెల్లడించే అపూర్వమైన ప్రేమికుల రోజు వచ్చేసింది. జాతి, కుల, మత, వర్గ, భాష, ప్రాంతీయ భేదాల్లేనిది.

**ఇలా మొద'లవ్'తుంది....**

గుండెనిండా దాచుకున్న ఆకాశమంత ప్రేమను, మాటల్లో చెప్పలేని అనంతమైన భావాలను అదొక అందమైన లోకం. యువత హుషారుకు హద్దులుండవు. కవ్వింతలకు కళ్ళాలుండవ్. శృతిలేని పాటలు.. శతకోటి ఆటలు. ఒకరికొకరు ఇచ్చుకునే గ్రీటింగ్స్, వాటిలో చిలిపి కవితలు, ప్రేమ రాతలు.. కాలేజీల్లో, పార్కుల్లో, మాల్స్‌లో అంతటా వారే. అరె! ఏంటి ఈ ప్రత్యేకత అంటే? మరి ప్రత్యేకతే. ఫిబ్రవరి 14న 'ప్రేమికుల రోజు'. అదే వారి ఖుషీకి కారణం. ప్రేమ జంటల చిరు కానుకలుగా గులాబీ పువ్వులు, చాక్‌లేట్‌లు, షేక్‌హాండ్‌లు.. ఒకటేమిటి ప్రేమైకజీవుల కోలాహలం అంతా ఇంతా కాదు. ప్రపంచ వ్యాప్తంగా అలా అలా ప్రవర్ధమానమవుతూ వాలెంటైన్స్'డే' ప్రాచుర్యం పొందింది. 'చిరునవ్వుల వరమిస్తావా..చితి నుంచి లేచొస్తాను.. మరుజన్మకు కరుణిస్తావా.. ఈ క్షణమే మరణిస్తాను..!' లాంటి ప్రేమ కవితలు అతిశయాన్ని మేళవించుకుని ఉంటే.. 'కమ్మనీ ఈ ప్రేమలేఖనే రాసింది హృదయమే..ప్రియతమా నీవచట కుశలమా నేనిచట కుశలమే..ఊహలన్ని పాటలే కనుల తోటలో..తొలి కలల కవితలే మాట మాటలో..' అంటూ ప్రేమ గొప్ప ఉపశమనం కలిగిస్తుందని చెప్పడం.. ఏదేమైనా ప్రేమ చాలా గొప్పది. ఈ నెల 14న వాలెంటైన్స్ డే సందర్భంగా దీనిపైనే ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం..

**ప్రేమికుల రోజు ఎలా వచ్చిందంటే..**

వాలెంటైన్ ఎవరు..? వాలెంటైన్ అనే ఒక ప్రవక్త ప్రేమికుల రోజు పుట్టడానికి ఆద్యుడు. క్రీస్తుపూర్వం 270లో రోమ్ దేశంలో జీవించిన వాలెంటైన్ యువతకు ప్రేమ సందేశాలు ఇవ్వడం, ప్రేమ వివాహాలను ప్రోత్సహించడం చేసేవాడు. దీంతో యువతలో ..మిగతా 2లో

# ప్రమాద ఘటికలు మోగిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు!

**జన సంచారాల్లో రక్షణ కంచెలేని ట్రాన్స్ ఫార్మర్లు....**
**ఆందోళనలో వాహనదారులు,స్థానిక ప్రజలు..**
**నిర్లక్ష్యానికి సజీవ సాక్షాలుగా ....**



నిడమనూరు, ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి): విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అధికారుల తీరు "నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు" అన్న చందనంగా ఉందని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.ప్రజలు మాత్రం ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక అమాయకంగా ప్రమాదం అంచున ప్రయాణాలు సాగిస్తున్నారు.నిత్యం ప్రజలు సంచరించే ప్రదేశాల్లో రోడ్ల ..మిగతా 8లో

# నేడు ప్రేమికుల దినోత్సవం..



**మొదటి పేజీ తరువాయి...**

వాలెంటైన్ పట్ల క్రేజ్ పెరిగింది. అదే సమయంలో రోమ్‌ను పాలిస్తున్న చక్రవర్తి క్లాడియస్ కుమార్తె వాలెంటైన్ అభిమానిగా మారడంతో చక్రవర్తికి భయం పట్టుకుంది. దీంతో యువతకు ప్రేమ సందేశాలిచ్చి తప్పుడు దోవ చూపిస్తున్నాడన్న నెపంతో వాలెంటైన్‌కు మరణశిక్ష విధించి ఫిబ్రవరి 14న ఉరి తీయించాడు. ఈ ఘటన జరిగిన రెండు దశాబ్దాల తర్వాత అప్పటి పోప్ గెలాసియన్స్ వాలెంటైన్ మరణించిన రోజును ప్రేమికుల రోజుగా ప్రకటించారు. అప్పటినుంచి ఖండాంతరాలను దాటుకుని ప్రపంచవ్యాప్తంగా ప్రేమికులు పండుగగా జరుపుకునేలా ప్రేమికుల దినోత్సవం విస్తరించింది. ఈ రోజును ఒక్కో దేశంలో ఒక్కోలా జరుపుకొంటారు.

ప్రేమంటే ఇచ్చిపుచ్చుకోవడం.. ఒకరిపట్ల ఒకరికి ఉండే నమ్మకం.. ఇలా ఎన్నో భావనలు.. స్వేచ్ఛగా.. స్వచ్ఛంగా.. తమకోసమే అన్న ఫీలింగ్.. అయితే అందరి మధ్య ప్రేమ ఇలాగే ఉందా? అంటే లేదనే చెప్పాలి. ప్రేమ ప్రేమనే కోరుకోవాలి. కానీ నేటి ప్రేమలు తామరాకుపై నీటిబొట్టులా ఉంటున్నాయి. కులమతాల అంతరాలు ప్రేమికులకు ఉచ్చు బిగిస్తున్నాయి. కులదురహంకార హత్యలు పెచ్చుమీరుతున్నాయి. కన్నబిడ్డల్ని సైతం పొట్టనపెట్టుకునేంతగా కసాయితనాన్ని నూరిపోస్తున్న పరిస్థితులు. ఈ అంతరాల కంచెల్ని తొలగించినప్పుడే నిజమైన ప్రేమ వర్ధిల్లుతుంది. ఇది ఇలా ఉంటే మరో వైపు కార్పొరేట్ శక్తులు ప్రేమను వ్యాపార సరుకుగా మార్చేస్తున్నారు. తమ ఉనికిని పెంచుకోవాలని తాపత్రయపడే రాజకీయ నాయకులు.. కుహనా సంస్థలు.. ప్రేమకు ఆటంకంగాను తయారవుతున్నాయి. ఈసారి మరింత హేయంగా వాలెంటైన్స్ డేని 'కౌ హగ్ డే'గా జరపాలని కేంద్రం పిలుపునివ్వడం పై పరిస్థితులకు అద్దంపడుతోంది. అయితే ప్రజల నుంచి నిరసన వెల్లువెత్తడంతో రెండు రోజుల తర్వాత ఆ పిలుపును ఉపసంహరించుకున్నారు. ఈ తరహా పద్ధతులు సమాజానికి ఏ విధంగా ఉపయోగ పడతాయనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సి ఉంది.

**-సమాజాభ్యున్నతికి..**

ప్రేమ.. ప్రాణి పుట్టినప్పటి నుంచి ఉంది. అది లేకపోతే మానవాళి మనుగడ ఉండేది కాదు. ఇది ఏ ఒక్కరోజుకో పరిమితమయ్యేదీ కాదు. నిరంతరం మన ఉచ్ఛ్వాస నిశ్వాసల్లా ఉంటుంది. అయితే అది నిజమైనదై ఉండాలి. సమాజాభ్యున్నతికీ, సహ వ్యక్తికీ ఉపయోగపడేదే నిజమైన ప్రేమ. కారల్ మార్క్స్-జెన్నీలది ప్రేమ వివాహమే. జెన్నీది ఆర్థికంగా ఉన్నతమైన కుటుంబం. అయినా తాము నమ్మిన సిద్ధాంతం కోసం, ఈ సమాజాభ్యున్నతి కోసం తమ జీవితాల్ని అంకితం చేశారు. ఎన్నో కష్టనష్టాలను భరించారు. నిర్బంధ జీవితాన్ని అనుభవించారు. దుర్భర పరిస్థితుల్లో బిడ్డలను కోల్పోయారు. అయినా వారి ఆశయాన్ని వదులుకోలేదు. వారి మధ్య ప్రేమ ఏ నిర్బంధానికీ లొంగలేదు. ఏ కాఠిన్యానికీ కుంగలేదు. జీవితం చివరి వరకూ సమాజాభ్యున్నతికే పాటుపడ్డారు వారిద్దరూ. అలాంటి ప్రేమ వారికి మాత్రమేకాక సమాజానికీ ఉపకరిస్తుంది. పటిష్టమైన కుటుంబవ్యవస్థ నెలకొంటుంది.

**-ప్రేమా..? ఆకర్షణా..?**

తెలిసీ తెలియని వయసు.. బాధ్యతా రహిత్యమైన పెంపకం.. నిర్లక్ష్యపు ప్రవర్తన.. ఇవన్నీ యువతను పక్కదారి పట్టిస్తున్నాయి. వారి ఆలోచనా విధానమే సరిగా ఉండని పరిస్థితి. వారికి మార్గ నిర్దేశం చూపించే వారుండ రు. అలాంటప్పుడే ఆకర్షణను ప్రేమగా భావిస్తారు. అంతర్జాల మాయలో పడతారు. మత్తు పదార్థాల బారిన పడే అవకాశం ఉంటుంది. అయినా వారు చేసేది కరెక్టే అని గట్టిగా నమ్ముతారు. యువత బలహీనతను కొన్ని నిరోధక శక్తులు వినిమయ వస్తువుగా ఉపయోగించుకుం టున్నాయి. స్వార్థంతో కూడుకున్న ప్రేమ అనే భావన వారి జీవితంలో హాలాహలమై.. దావానలమై.. జీవితాన్నే నాశనం చేస్తోంది. ఇది ప్రమాద సంకేతం. జుగుప్సాకర, వికృత చిత్రాలను వెదజల్లుతున్న అంతర్జాల మాయాజాల ప్రభావం నుండి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. బంధనాల చదువులు.. కట్టి పడేసే కట్టుబాట్లు.. ఆకర్షించే డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్స్ వినియోగం యువత సంకల్పాలకు సంకెళ్ళు వేస్తున్నాయి. వారి శక్తిని, యుక్తిని నిర్వీర్యం చేస్తున్నాయి. వారి ఆలోచనా సరళి అనంతం.. దానికి హద్దులు పెట్టి, సంకట స్థితిలో వదిలేయక సరైన మార్గ నిర్దేశం చేస్తే సమాజాభివృద్ధి జరుగుతుంది. బాల్యం నుంచి పిల్లలకు నైతిక, సామాజిక విలువలు నేర్పించాలి. దానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర వహించాల్సి ఉంటుంది. అప్పుడే మానవ విలువల పట్ల అవగాహన ఉంటుంది.

**-పరిమితితో.. పరిణతి లేమితో..**

ఆర్థిక పరిస్థితులలో, అభివృద్ధి అనే భావనో మొత్తానికి ఉమ్మడి కుటుంబ స్థాయి పరిమిత కుటుంబాలకు చేరింది. చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అనుకుంటారుగానీ, పరిణతి లేమితో తీసుకునే నిర్ణయాలతో పరిస్థితులే మారిపోతున్నాయి. ఒకరినొకరు అర్థం చేసుకునే ఓర్పు నశిస్తుంది. తొందరపాటు పెళ్ళిళ్ళు, బాధ్యత లేని పిల్లల పెంపకం అనేక అనర్థాలకు దారితీస్తున్నాయి. ప్రేమ.. పెళ్ళి.. విడిపోవడం సాధారణ విషయంగా మారిపోయింది. అదేమంటే దానికి స్వేచ్ఛ అనే నేమ్‌ప్లేట్ తగిలించి, చేతులు దులుపుకుంటున్నారు. పెళ్ళి ఎంత ఈజీగా చేసుకుంటున్నారో అంతే త్వరగా విడిపోతున్న జంటలను నిత్యం మనం చూస్తూనే ఉన్నాం. ఇది వారి పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లల భవిష్యత్తు దుర్భరంగా మారుతుంది. ఇదంతా పరిణతి లేకపోవడం, పరిస్థితుల్ని ఎదుర్కోగలిగే ఆత్మస్థైర్యం లేకపోవడం వల్లనే జరుగుతుంది.

**-స్వార్థపూరితంగా..**

అదే ఆకర్షణతో, ఎలాంటి ఆలోచన లేకుండా, తమ స్వార్థం కోసం వినియోగించుకునే వాళ్లూ ఉన్నారు. అలాంటివాళ్లు వాళ్ళను వాళ్ళు మోసం చేసుకోవడమే కానీ, దాని వలన వారు సాధించేదేమీ ఉండదు. నైతిక విలువలకు తిలోదకాలిస్తారు. స్వలాభాపేక్షతో అనేక చిక్కుల్ని ఎదుర్కొంటారు. సృష్టిలో ప్రేమ ఒక్కటే తనకు మాత్రమే చెందినదిగా ఉంటుంది. మన మనసులోంచి పుడుతుంది. కాబట్టి దానిని ఇచ్చే హక్కే మనకు ఉంటుంది. బలవంతంగా.. ఉన్మాదంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే వికటిస్తుంది. అది అసలు ప్రేమే కాదు.

**-వ్యాపార సరుకుగా..**

నిజమైన ప్రేమకు కొలమానాలుండవు. ఇచ్చి పుచ్చుకునే వస్తువులకు ప్రాధాన్యత ఉండదు. ఇతరులతో పోల్చుకుని వాళ్ళంత గొప్ప కానుకలిచ్చుకుంటే.. నేనంతకంటే గొప్పదివ్వాలనే పోటీతత్వంలోకి ప్రేమ నెట్టబడింది. దాంతో కృత్రిమత్వం చోటు చేసుకుంది. ప్రేమ విషయంలో నటనలు, రకరకాల ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మానవ సంబంధాలు పలుచనై, 'నేను' అనే స్వార్థం మనిషిని ఆవహిస్తుంది. అదే భావం అనుబంధాలను, ఆప్యాయతలను సరుకులుగా మార్చేస్తుంది. వినిమయ సంస్కృతి అలవడుతోంది. ప్రేమ వ్యాపార సరుకుగా మారిన నేపథ్యంలో ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచే వ్యాపార ప్రకటనలు గుప్పిస్తారు. గులాబీ పూల దగ్గర నుంచి దుస్తుల వరకూ ఒకటికాదు.. కీచైన్లు.. హెయిర్ క్లిప్స్, తలగడ ఇలా అది ఇదేమని అన్నీ హృదయాకారంలో తయారుచేసి, వాలెంటైన్స్ డే పెద్ద ఎత్తున వాణిజ్యం చేస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా వందల కోట్ల వ్యాపారం జరుగుతోందంటే అతిశయోక్తి కాదు. ఈ మాయాజాలంలో కొట్టుకుపోయే వినమయ సంస్కృతి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అసలు ప్రేమను వ్యక్తం చేయడానికి ప్రత్యేకంగా ఒక రోజనేదే సరికాదు. ప్రేమ అనంతమైనది.. అద్వితీయమైనది. ఎన్నాళ్లయినా.. ఎన్నేళ్లయినా.. నిరంతరం కొనసాగాల్సింది.

**-ప్రేమకు పరిమితులా..**

అంటే 'ప్రేమ' పరిమితమా.. ప్రమాదమా.. అనంతమా.. నిరంతరమా..నిరోధమా.. విరోధమా..? దీనిపై ఎన్నో భావాలు, భావావేశాలు, అభిప్రాయ భేదాలు అనాదిగా కొనసాగుతూనే ఉన్నాయి. 'నిజమైన ప్రేమ'ను ఎవ్వరూ అడ్డుకోలేరు. దానికి పరిమితి లేదు. ప్రేమ మానసికమైనది. భౌతికంగా బహిర్గతం చేయనక్కర్లేదు. ఎవరికీ హాని చేయనంతవరకూ, 'నేను' కాదు 'మనము' అనే భావం ఉన్నంత వరకూ ప్రేమ అనంతమే.. నిరంతరమే విశృంఖలతను ప్రేమగా వక్రీకరిస్తే ప్రమాదమే మరి. దాని వెంటే నిరోధమూ అవసరమౌతుంది.

**-సామాజిక కట్టుబాట్లు..**

రానురాను సామాజిక కట్టుబాట్లకు గురై ఒంటరిననే భావనకు లోనవుతున్నారు జనం. పిల్లలను బాల్యం నుంచే బాంధవ్యాలకు దూరంగా పెంచుతున్నారు. అభద్రతా భావంతో ప్రేమ స్థానంలో కోపాన్ని ప్రదర్శిస్తున్నారు. అది తర్వాత వికృత రూపం దాలుస్తోంది. ఒక వ్యక్తి మీద ఇష్టం కలిగితే అదే ప్రేమనుకోవడం.. ఇంట్లో పొందలేని స్థితిలో ఎవరైనా కాసింత ప్రేమ చూపించగానే అదే ప్రేమని భ్రమపడటం జరుగుతోంది. తాను ప్రేమించే వ్యక్తికి ఆ భావన లేదనడంతోనే చనిపోవడం.. లేదా చంపడం.. పరిపాటి అయిపోయింది. వారికి కావాలనుకున్నది పొందడానికి అవతలి వ్యక్తి గుర్తించి కనీసపు ఆలోచనను విస్మరించడమే. స్త్రీని వస్తువుగా చూసే దృక్పథం నుంచే ఇలాంటి భావనకు గురికావడం. ఆమె కూడా మనిషేననే వాస్తవాన్ని తెలుసుకొని మసలుకోవాలి.

**-అంతరాలు.. అవాంతరాలు..**

ప్రేమకు అనాది నుంచీ అంతరాలు, అవాంతరాలు ఉన్నాయి. అవి ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. సామాజిక,ఆర్థిక అవాంతరాలు వికటించి హత్యలు, హింస రూపంలో సమాజంలో జుగుప్సాకరమైన పరిస్థితులు నెలకొల్పుతున్నాయి. దాంతో జీవితాంతం ఆ కుటుంబం బాధ పడటం తప్పించి వేరే ప్రయోజనం ఉండదు. 21వ శతాబ్దంలోనూ పేద-గొప్ప, ఉన్నత-నిమ్న, తెలుపు-నలుపు అంతరాల మధ్య కొట్టుమిట్టాడటం, కొట్లాటలు జరగటం ఈ అంతరాలకు చిహ్నాలే.

**-పెంపక లోపాలు..**

ఏ తల్లిదండ్రులైనా తమ బిడ్డ అందరిలో ముందుండాలని అనుకోవడం, బాగా సంపాదించాలనుకో వడం వరకే ఆలోచిస్తున్నారు. కానీ వారి శక్తియుక్తుల గురించి ఆలోచించడం లేదు. సామాజిక పరిస్థితుల గురించి ఆలోచించడం లేదు. అందరితో మంచిగా ఉండాలనుకోవడం లేదు. సమాజానికి ఎంత వరకు ఉపయోగపడతారని చూడడం లేదు. మనం సమాజంలోనే ఉంటాం. కానీ సమాజం గురించి ఆలోచించం. పిల్లలను ఆలోచించనివ్వం. ఎవరితో కలవనివ్వం. ఎవరినీ 'మన' అనుకోనివ్వం. కలవారి తనానికి లోబడి, కలుషిత స్నేహాలకు నాంది పలుకుతాం. స్వార్థ ప్రేమను స్వాగతిస్తాం. 'నా' అని గిరిగీసుకుని పెంచుతాం. ఆ 'నా'లో ప్రేమకు స్థానముండదు స్వార్థం తప్ప.

**-విద్వేషం వెదజల్లుతూ..**

ఒకవైపు వినిమయ సంస్కృతిని ప్రోత్సహిస్తూ.. కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తూ.. ధనవంతుల్ని మరింత ధనవంతుల్ని చేస్తున్నారు. వారిని అడ్డుకోవడమనే ఆలోచనే చేయరు. మరోవైపు ప్రేమికుల రోజు విదేశీ సంస్కృతి అంటూ.. మన సాంప్రదాయం కాదంటూ.. సాంప్రదాయ ముసుగు వేసుకున్న హిందుత్వ సంస్కృతికి తెరలేపుతున్నారు. ప్రేమికుల రోజు నిర్బంధపు పెళ్ళిళ్ళు చేయడానికి పూనుకుంటున్నారు. ఈసారి మరో విపరీతాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ వాలెంటైన్స్ డేని 'కౌ హగ్ డే'గా నిర్వహించాలని ఏకంగా పాలకులే పిలుపునిచ్చారు. మొదటి నుంచి స్త్రీ కన్నా ఆవుకే ప్రాధాన్యత ఇస్తూ వచ్చే ఈ సంస్కృతిని ఏమనాలి? ఏవిధంగా అర్థం చేసుకోవాలి? జంతువుల్నీ ప్రేమించాలి. కానీ మనుషుల స్థానంలో వాటిని అంటే.. ఈ ప్రేమించే తత్వాన్ని చెరిపేసే విద్వేషపు ఆలోచనలకు చరమగీతం పాడాల్సిందే.

**-భారతదేశం...విదేశాలలో..**

-మనదేశంలో :మనదేశంలో 20-30 ఏళ్లుగా ప్రేమికుల రోజును జరుపుకొనే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ సంఖ్యతో పాటు పాశ్చాత్య సంస్కృతిని నిషేధించాలనే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇంగ్లీష్ ప్రధాన భాషగా చలామణిలో ఉన్న అన్ని దేశాల్లో ప్రేమికుల దినోత్సవాన సెలవు ఇచ్చే విధానం ఉంది. మనదేశంలో అలా లేదు.

-ఇటలీలో.. :ఇటలీలో ఫిబ్రవరి 14వ తేదీ ఉదయం మొట్టమొదటిసారి చూసిన వ్యక్తే తమ జీవిత భాగస్వామిగా మారతారనే భావన ఉంది. అలా కనిపించిన వారితో తర్వాతి ప్రేమికుల దినోత్సవానికి వివాహం కూడా అయిపోతుందని నమ్మకం.

-జర్మనీలో.. :జర్మనీలో ప్రేమికుల రోజున పంది బొమ్మ లేదా పంది బొమ్మ ఉన్న గ్రీటింగ్ కార్డును ఇచ్చిపుచ్చుకోవడం శుభసూచకంగా భావిస్తారు. దీంతో వాలెంటైన్ డేకు ముందు పంది బొమ్మలకు జర్మనీలో డిమాండ్ పెరుగుతుంది.హో

-అర్జెంటీనాలో.. :అందరికీ ప్రేమికుల రోజు ఉంటే అర్జెంటీనా వాసులకు ప్రేమికుల వారం ఉంది. ఆ దేశంలో జూలై 13 నుంచి 20వ తేదీ వరకూ వారం పాటు వాలెంటైన్ వీక్‌గా జరుపుకొంటారు.

-కొరియాలో.. :కొరియాలో రెండు సంప్రదాయాలున్నాయి. ఏప్రిల్ 14ను వైట్ డేగా భావిస్తూ ఓ పక్క ప్రేమికులు ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకుంటుంటారు. మరోపక్క ప్రేమలో పడనివారు ఇదేరోజును బ్లాక్ డేగా భావిస్తూ నల్లటి దుస్తులు ధరిస్తారు.

-జపాన్‌లో.. :జపాన్‌లో వాలెంటైన్స్ డేన ప్రేమికులు బహుమతులుగా చాక్లెట్లను ఇచ్చుకుంటారు. అందుకోసం ప్రత్యేకంగా చాకెట్లు తయారుచేస్తారు. ఇలా చాక్లెట్లు బహుమతిగా అందుకున్న వారు నెల తర్వాత అవతలి వారికి చాక్లెట్లతో పాటు బహుమతులనూ అందజేస్తారు.హో

-పక్షుల కోసం :ఫిబ్రవరిలో పక్షులు తమ జంటల కోసం ఎక్కువగా వెతుకుతాయి. కాబట్టి పక్షులూ ప్రేమను తెలుపుకొంటాయనే ఆలోచనతో ఈ రోజును ఎంపిక చేశారు.హో

-గ్రేట్ గ్రీటింగ్:అమెరికా, డెన్మార్క్, యూకే, ఇటలీ, జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా దేశాల్లో వాలెంటైన్స్ డేను పెద్ద పండుగలా చేస్తారు. క్రిస్మస్ తర్వాత ఎక్కువగా గ్రీటింగ్స్ పంచుకునే రోజుగా వాలెంటైన్స్ డే గుర్తింపు పొందింది. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా వంద కోట్ల గ్రీటింగులు అమ్ముడవుతాయని అంచనా.హో

-ప్రేమకు అడ్రెస్:ప్రేమికుల రోజున ధరించే డ్రెస్ కూడా ఒక సందేశాన్ని పంపుతుంది. ఆ సందేశా న్ని పసిగట్టేలా రంగులకూ కొన్ని అర్థాలు ఏర్పాటు చేసుకున్నారు.హో

పింక్ : గోయింగ్ టు ప్రపోజ్
బ్లూ : వెలకమ్ ఫర్ అప్లికేషన్స్
ఆరెంజ్ : ఆల్రెడీ ఇన్ లవ్
బ్లాక్ : నాట్ ఇంట్రస్టెడ్
ఎల్లో : లవ్ ఫెయిల్యూర్
గ్రీన్ : లవ్ యాక్సెప్టెడ్
వైట్ : డబుల్ సైడ్

-ఏడు రోజుల పండగ

వాలెంటైన్స్ వీక్‌లో మొదటి రోజైన ఫిబ్రవరి ఏడును రోజ్ డేగా ప్రేమికులు భావిస్తారు. తమ అనుబంధాన్ని పెంచుకోవడం కోసం గులాబీలను అందజేస్తారు.హో

ఇష్టపడిన వారికి మొదటిసారి ప్రపోజ్ చేయడం కోసం ఫిబ్రవరి ఎనిమిదిని ప్రపోజ్ డేగా సెలబ్రేట్ చేసుకుంటారు.ప్రేమ బంధం ఎప్పటికీ తీయగా ఉండాలనే ఉద్దేశంతో ప్రేమికులు చాక్లెట్లు ఇచ్చిపుచ్చుకుంటారు. అందుకోసం ఫిబ్రవరి తొమ్మిదిని చాక్లెట్ డేగా జరుపుకొంటారు.బహుమతులెన్నున్నా అమ్మాయిలు టెడ్డీబేర్‌లను బాగా ఇష్టపడతారు. టెడ్డీని బహుమతిగా ఇవ్వడం ద్వారా తామెప్పుడూ ప్రేయసి వెన్నంటే ఉన్న భావన కలిగించవచ్చు. అందుకోసం ఫిబ్రవరి 10ని టెడ్డీ డేగా జరుపుకొంటారు.నమ్మకానికి గుర్తుగా ప్రామిస్ చేసుకుంటారు. అదే ఫిబ్రవరి 11న ప్రామిస్ డేగా ఎన్ని కష్టాలొచ్చినా విడిపోకూడదనే ఉద్దేశంతో జరుపుకొంటారు. ప్రేమికులు తమప్రేమను ముద్దు ద్వారా తెలియపరుచుకునే రోజు ఫిబ్రవరి 12. దీన్నే కిస్‌డేగా వ్యవహరిస్తారు. ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని తమ ప్రేమను పంచుకునే రోజు హగ్ డే. ఫిబ్రవరి 13ను హగ్ డేగా జరుపుకొంటా రు. వీటన్నింటిని ఒక్క రోజులోకి మార్చితే ఫిబ్రవరి 14..అదే ప్రేమ పండగ. ప్రేమికుల దినోత్సవం అంటారు.

# ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

**ఆర్డీవో సూర్యనారాయణ ...**





కోదాడ టౌన్, ఫిబ్రవరి 13( ప్రజాజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు కోదాడ డివిజన్ కేంద్రంలో ఈ నెల 15న గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. మంగళవారం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో కోదాడ నియోజకవర్గం గిరిజన సంఘం నాయకులతో సేవాలాల్ జయంతి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి వేడుకల్లో గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుల పలు సూచనలు సలహాలను ఆర్డీవో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సైదా నాయక్, హాజీ నాయక్, లచ్చిరాం నాయక్, రాజు నాయక్, బానోత్ నందలాల్, కృష్ణ నాయక్, ఏఎస్ఐ హనుమాన్ నాయక్, పంతులు నాయక్ ,రామా నాయక్ ,బావ సింగ్ తదితరులు పాల్గొన్నారు

# క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన ఎస్ఐ అజయ్ కుమార్



నడిగూడెం, ఫిబ్రవరి 13, ప్రజా జ్యోతి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల సబ్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ ను సమాచార హక్కు వికాస సమితి సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సమాచార హక్కు వికాస సమితి నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఎస్ఐ అజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జగన్నాథం , ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దున్న శ్రీనివాస్ , సమాచార హక్కు వికాస సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరి శివ, జిల్లా కార్యదర్శి కిన్నెర ఉపేందర్ రావు ,మండల అధ్యక్షులు చల్ల సతీష్, నియోజకవర్గ కార్యదర్శి నోముల బుచ్చయ్య, మండల ఉపాధ్యక్షులు దారపునేని బశ్వంత్, పాతకోట్ల నాగేశ్వరరావు ,దారావతు రమేష్ పాల్గొన్నారు ,

# కారు ఢీకొని వ్యక్తి మృతి

తిరుమలగిరి ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి) : కారు అతివేగంగా వచ్చి స్కూటీపై వెళుతున్న యువకుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించిన సంఘటన మంగళవారం నాడు తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్ వద్ద జరిగింది ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం మున్సిపల్ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన జోగు ప్రసాద్ తన స్కూటీపై శుభమస్తు ఫంక్షన్ హాల్ నుండి తిరుమలగిరి క్రాస్ రోడ్ వైపు వస్తుండగా అతివేగంగా వస్తున్న కారు స్కూటీని డి కో ట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న జోగు ప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందడాని తెలిపారు. కారు డ్రైవర్ చింతా నిఖిల్ అతివేగంగా నడపడం మూలంగానే ప్రమాదం జరిగిందని తెలిపారు మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్ట్ మార్ట0నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడు జోగు ప్రసాద్ తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్లో నైట్ వాచ్ మన్ గా పనిచేస్తున్నట్టు తెలిసింది

# సొసైటీ డైరెక్టర్లకు నోటీసులు జారీ



నడిగూడెం, ఫిబ్రవరి 13, ప్రజా జ్యోతి: 29న నడిగూడెం కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ల సమావేశానికి నోటీసులు జారీ చేసినట్లు జిల్లా సహకార అధికారి నామ శ్రీధర్ అన్నారు .మంగళవారం నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పాలకవర్గానికి చెందిన 9 మంది డైరెక్టర్లు డిసెంబర్ 29 జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు .ఈ మేరకు పాలకవర్గం చైర్మన్ పై అవిశ్వాసం వ్యక్తపరిచారు. అందిన ఫిర్యాదు మేరకు సూర్యాపేట జిల్లా సహకార అధికారి నామ శ్రీధర్ జనవరి 20 న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ పాలకవర్గ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. దీనిపై సంఘం చైర్మన్ పుట్ట రమేష్ సహకార ట్రిబ్ నల్ లకు వెళ్లి స్టే తేవడంతో ప్రత్యేక సమావేశం నిలిచిపోయింది. ట్రిబనల్ ఇచ్చిన స్టేను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈనెల 29న ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని కోరుతూ జిల్లా సహకార అధికారి నామ శ్రీధర్ పాలకవర్గం సభ్యులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు.



# ఫిబ్రవరి 18న జరిగే టాలెంట్ టెస్ట్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి

**ఎంఇఓ బాలాజీ నాయక్**

మిర్యాలగూడ ఫిబ్రవరి 13, ( ప్రజా జ్యోతి ): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 18న బకల్వాడి ప్రభుత్వ పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి టాలెంట్ పరీక్ష ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఎం ఈ ఓ బాలాజీ నాయక్ కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఎప్పుడు ఉద్యమాలే కాకుండా పేద మధ్య తరగతి విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం కామన్ పరీక్షల కంటే ముందు ఇలాంటి ప్రతిభ పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొట్టడం అభినందనీయమన్నారు. టాలెంట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరికీ మంచి పారితోషికాలు, బహుమతులు కూడా అందజేస్తారన్నారు.ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో చదివే పదొవ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులందరూ తమ పాఠశాలలో హెడ్మాస్టర్ దగ్గర 30 రూపాయల ఫీజులు చెల్లించి హాల్ టికెట్ పొంద వచ్చని తెలిపారు.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్,ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ ధర్మానాయక్, పరశురాం,ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, కోటేష్, శివ, కళ్యాణ్ తరుణ్, అజయ్, కుమార్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ గులాబీ శ్రేణుల గుండెల్లో ఎంసి. కె ఆర్.!

హాలియా,ఫిబ్రవరి13(ప్రజా జ్యోతి) : కృష్ణా జలాల వివాదంపై బీఆర్ఎస్ పార్టీ చలో.. నల్గొండ బహిరంగ సభ నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభకు ఉమ్మడి జిల్లాలు నల్లగొండ,ఖమ్మం మహబూబ్ నగర్,రంగారెడ్డి



హైదరాబాద్ జిల్లాల నుండి భారీగా గులాబీ శ్రేణులు తరలివచ్చారు. మంగళ వారం నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా మాజీ సీఎం,బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ హాజరై ప్రసంగించి కార్యకర్తల్లో జోష్ నింపారు.ఈ సభకు నాగార్జునసాగర్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున వాహనాలలో తరలి వెళ్లారు. బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నీటి జలాలపై మాట్లాడుతుండగా నాగార్జునసాగర్ నియోజకవర్గ గులాబీ కార్యకర్తలు ఒకేసారి తమ అభిమాన నాయకుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ప్లే కార్డులను ప్రదర్శించి అభిమానాన్ని చాటుకున్నారు. దీంతో బహిరంగ సభలో ఉన్న గులాబీ శ్రేణుల దృష్టి ఒకేసారి అటువైపు మల్లడంతో ప్లే కార్డులో ఉన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి చిత్రం అందరని ఆకట్టుకుంది.రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత నిర్వహించిన మొదటి సభకు సాగర్ నియోజకవర్గం నుండి గులాబీ శ్రేణులు భారీగా తరలి వెళ్లినారు.

# సూర్యాపేట జిల్లా సహకార అధికారిగా ఎస్.పద్మ

సూర్యాపేట కలెక్టరేట్,ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి):సూర్యాపేట జిల్లా సహకార శాఖ అధికారిగా ఎస్.పద్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు ఇక్కడ సహకార



అధికారిగా పనిచేసిన ఎన్.శ్రీధర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పద్మ బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు,సిబ్బంది సహకారంతో జిల్లాలో ఎలా%శీ%టి సమస్యలు తలెత్తకుండా సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సహకార శాఖ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

# నల్గొండ జిల్లా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన బుర్రి శ్రీనివాస్ రెడ్డిని పలువు నాయకులు

నార్కట్ పల్లి ఫిబ్రవరి 13( ప్రజా జ్యోతి) ఇటీవల నల్గొండ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన బుర్రి శ్రీనివాస్ రెడ్డిని దైద రవీందర్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన నివాసంలో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనరసింహ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డే భూపాల్ రెడ్డి, నార్కట్పల్లి కాంగ్రెస్ పార్టీ టౌన్అధ్యక్షుడు జేరిపోతల భరత్ గౌడ్, కట్టంగూర్ యూత్ కాంగ్రెస్అధ్యక్షుడు బండారు ఆనంద్, చిట్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కిషోర్, చెరుకుపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.



# అధికారుల నిర్లక్ష్యం వల్ల టెండర్ వేసే అవకాశం కోల్పోయామంటూ మహిళ ఆవేదన



మిర్యాలగూడ, ఫిబ్రవరి 13, ( ప్రజా జ్యోతి ): అధికారుల జాప్యం, నిర్లక్ష్యం వలన కోర్టుకు పోయి ఆదేశాలు తెచ్చుకున్నప్పటికీ తమకు టెండర్లలో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందని మిర్యాలగూడ పట్టణానికి చెందిన గజ్జి అమృతవల్లి ఆరోపణలు వ్యక్తం చేశారు. మంగళవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పౌరసరఫరాల ఎం ఎల్ ఎస్ పాయింట్ స్టేజి 1,2 టెండర్లలో పాల్గొనెందుకు వచ్చిన తమను రేషన్ డీలర్ బంధువులు పాల్గొనే అవకాశం లేదంటూ అధికారులు అడ్డు చెప్పారని, దీనిపై హైకోర్టును ఆశ్రయించిన తమకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ చివరి రోజు వరకు అధికారులు జాభ్యం చేశారని దానివలన కాంట్రాక్ట్ టెండర్ దక్కించుకునే అవకాశం లేకుండా పోయిందని గజ్జి అమృతవల్లి ఆవేదన వ్యక్తం చేశారు. 1983 నుండి1993 వరకు తన భర్త గజ్జి మధు రేషన్ డీలర్ గా పని చేస్తూనే స్టేజ్ వన్,స్టేజ్ టు కాంట్రాక్టర్ గా టెండర్ల లో పాల్గొన్నారు. తమ కుటుంబం పై అక్కసు తో ఇతర కాంట్రాక్టర్లు కొందరు 1994లో రేషన్ డీలర్లు, కుటుంబ సభ్యులు కాంట్రాక్టు టెండర్లలో పాల్గొనే అవకాశం లేదంటూ అప్పటి అధికారు లను మచ్చిక చేసుకొని నిలిపివేశారు అన్నారు. దీనిపై తమ కోర్టును ఆశ్రయించగా ఈనెల 7వ తారీఖున హైకోర్టు డీలర్లు వారి కుటుంబ సభ్యులు టెండర్లో పాల్గొనే అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసిందని, అట్టి ఆదేశాల ప్రతులను సంబంధిత అధికారులకు అందజేసినప్పటికీ, టెండర్ల చివరి రోజు అయిన 9వ తేదీ వరకు మభ్యపెట్టి, చివరి రోజు టెండర్లు వేసుకోవాలని తెలిపారని కానీ చివరి రోజు టెండర్ల కోసం జనాలు ఎక్కువగా ఉండటంతో క్యూ లైన్ లో నిలుచున్నప్పటికీ సమయం దాటిపోవడంతో టెండర్ దాఖలు చేసే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎమ్, ఎల్ ఎస్ పాయింట్ స్టేజి వన్ స్టేజి 2లకు నిర్వహించిన టెండర్లను రీ కాల్ చేసి తిరిగి కొత్తగా టెండర్లు పిలవాలని కోరారు.

## సంతు సేవా లాల్ 285వ జయంతిని విజయవంతం చేయండి



తిరుమలగిరి ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి) :ఈనెల 15న తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోనీ శుభమస్తు ఫంక్షన్ హాల్ లో జరిగే గిరిజన ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని సంత్ సేవాలాల్ నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షులు దరావత్ జుమ్మిలాల్. అధ్యక్షులు బానోతు రాముల నాయక్, ప్రధాన కార్యదర్శి భానోత్ కిస్టు నాయక్, తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సంతు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని అని చెప్పారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారని వారు తెలిపారు ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గిరిజనులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ ఉపా ధ్యక్షులు గూగులోతు రాజు నాయక్ ,మోహన్ నాయక్ ,కోశాధికారి ధరావత్ రవి నాయక్ రాజశేఖర్ సుధాకర్ నాయక్, భాస్కర్ నాయక్, భీమా నాయక్ సోమన్న నాయక్ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు

## పల్టీ కొట్టిన కారు నలుగురికి తీవ్ర గాయాలు



మిర్యాలగూడ, ఫిబ్రవరి 13, ( ప్రజా జ్యోతి ): కారు అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మిర్యాలగూడ మండలం కిష్టాపురం శివారు లోని అద్దంకి – నార్కెట్ పల్లి హైవేపై చోటు చేసుకుంది.స్థానికులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట సమీప గ్రామానికి చెందిన కొమరెల్లి మహేందర్ రెడ్డి కుటుంబం హైదరాబాదులోని ఉప్పల్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు.ఆయన కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలోని ఓ వివాహ వేడుకలో పాల్గొని తిరిగి కారులో హైదరాబాద్ వెళ్తుండగా మిర్యాలగూడ మండలం కిష్టాపురం వద్ద అద్దంకి –నార్కెట్పల్లి రహదారిపై కారు అదుపు తప్పి బోల్తాకొట్టింది.దీంతో కారులో ఉన్న నలుగురు భవ్య, శ్రీవాన్ రెడ్డి, రేవన్ రెడ్డి,మల్లారెడ్డిలు గాయాల పాలయ్యారు.సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.



## ఎన్నికలలో అన్ని టీములు నిబద్ధతతో పనిచేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సిహెచ్ ప్రియాంక.**



సూర్యాపేట కలెక్టరేట్ ఫిబ్రవరి 13(ప్రజా జ్యోతి): సూర్యాపేట కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో యంసిసి,ఎఫ్ ఎస్ టి,ఎస్ ఎస్ టి,వివిటి,ఫ్లయింగ్ స్క్వాడ్ లకు పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి యంసిసి వాయలేషన్ టీమ్స్ అన్ని ఎక్స్పెండిచర్ ఎలా బుక్ చేయాలి దానిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనీలుగా విప్పర్ల రమేష్,చందా శ్రీనివాసరావు డిఎల్ఎమ్టీసీగా వ్యవహరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యంసిసి టీమ్స్ అన్ని నిబద్ధతతో పనిచేయాలని,చెక్పోస్టుల వద్ద మద్యం మరియు నగదు రవాణా అరికట్టేందుకు టీమ్స్ అన్ని సక్రమంగా పనిచేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.యంసిసి లో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఎన్నికల సమయంలో చెక్పోస్టుల వద్ద ప్రభుత్వానికి సంబంధించిన వివిధ బ్యాంకులకు సంబంధించిన నగదు రవాణా జరిగేటప్పుడు అట్టి వాహనాలలో బ్యాంకులకు సంబంధించిన క్యూఆర్ కోడ్ ఉంటుందని ఎస్ఎస్ టి టిములు,ఫ్లైయింగ్ స్క్వాడ్ మొబైల్ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ను పరిశీలించి దానికి సంబంధించిన అన్ని ఆధార పత్రాలు ఉన్న వాటిని వెంటనే రిలీజ్ చేయాలని ఏ ఆధారం లేకుండా 50 వేల రూపాయల కంటే ఎక్కువ ఉన్నవారు వెంటనే అట్టి ధనాన్ని సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి తెలపాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. సెక్టోరల్ అధికారులు శిక్షణ కొరకు ఈవీఎంలను తరలించేటప్పుడు ఎస్కార్ట్ తో వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ ద్వారా టీముల అందరికీ అందజేసిన పుస్తకాలను వివరంగా చదవాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పూర్తి అవగాహనతో ఉండాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ రమేష్,చందా శ్రీనివాస్ వి వి టి ఎస్ ఎస్ టి ఎఫ్ ఎస్ టి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## చలో నల్లగొండకు తరలివెళ్లిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



పెన్ పహాడ్ మండలం ఫిబ్రవరి 13(ప్రజా జ్యోతి): బి ఆర్ ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పూరించిన మరో సమరశంఖం కృష్ణానది ప్రాజెక్టులను కేఆర్ఎంబీ కి అప్పగించడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన ఛలో నల్లగొండ బహిరంగ సభకు చీదేళ్ళ గ్రామ ఎంపీటీసీ జూలకంటి వెంకటరెడ్డి, బిఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షులు కీర్తి యలమంచయ్య,బిఆర్ఎస్ పార్టీ నాయకులు జూలకంటి రాజశేఖర్ రెడ్డి, కొండమీది లక్ష్మయ్య, నాగయ్య, కీర్తి గోపి, పొదిల రాములు, సతీష్, రామకృష్ణ తదితరులు తరలి వెళ్ళారు.

## సివిల్ సప్లై స్టేజ్ టు కాంట్రాక్ట్ టెండర్ల ప్రక్రియ ఏకపక్షంగా సాగింది



మిర్యాలగూడ, ఫిబ్రవరి 13, ( ప్రజా జ్యోతి ): పాత కాంట్రాక్టర్లకు మేలు చేసేలా వ్యవహరిస్తూ అధికారులు ఏకపక్షంగా చేసిన పౌర సరఫరాల శాఖ స్టేజ్ టు టెండర్ల ప్రక్రియను రద్దు చేసి తిరిగి పారదర్శకంగా నిర్వహించాలని కూరెళ్ళ శివశంకర్,కూరెళ్ళ వెంకటచారి, కుమ్మరి సందీప్ లు డిమాండ్ చేశారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రెస్ క్లబ్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను పూరసరఫరాల ఎంఎల్ఎస్ పాయింట్ స్టేజ్ 2 కాంట్రాక్టర్ కోసం టెండర్లను ఆహ్వానిస్తూ ఈ నెల ఒకటో తారీఖున పేపర్లో ప్రకటన ఇచ్చిన అధికారులు చివరి తేదీ 9వ తారీకుగా పేర్కొన్నారన్నారు. టెండర్లపై విస్తృత ప్రచారం చేయని అధికారులు, పాత కాంట్రాక్టర్లకి లబ్ధి చేకూర్చేలా కఠిన నిబంధనలు పెట్టారన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉండగా గతంలో ఒక్కో ఎంఎల్ఎస్ పాయింట్ స్టేజ్ టు టెండర్ కోసం 10 నుండి 20 వరకు దరఖాస్తులు వచ్చేవని, కానీ అధికారుల తీరు వలన జిల్లావ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఎం ఎల్ ఎస్ పాయింట్ల కోసం కేవలం 20 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు.దీనివలన ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది అన్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి, టెండర్లు రీకాల్ చేయాలని, విస్తృతంగా ప్రచారం నిర్వహించి తిరిగి టెండర్ల ప్రక్రియ కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ దంపతులకు సత్కారం



రాజపేట, ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి) అత్యంత మహిమగల, అతి పురాతన, కోరిన కోరికలు తీర్చే రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ రాజేశ్వరి పుణ్య దంపతులను మంగళవారం పలువురు ఘనంగా సన్మానించారు. వారి వివాహ దినోత్సవం పురస్కరించుకొని అర్చక స్వాములు స్వగృహంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆశీర్వచనం పొందారు. వివాహ దినోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ సత్కారం చేశారు. మార్త జగదీశ్వర్, ఇమ్మడి శ్రీనివాసులు, బిర్రు శ్రీనివాసులు, శ్రీ వెంకటేశ్వర ఆలయ మఠం అర్చక స్వాములు మహంత్ మఠంల రామేశ్వర్ దాస్, నంగునూరు రాజు, బుడమ సత్యనారాయణ, బెజుగం శ్రీనివాసులు, నాళ్ల శేఖర్, బెజుగం చంద్రశేఖర్, పెద్ది సంతోష్ కుమార్, పుల్లూరు శ్రీనివాసులు, ఉప్పల శ్రీనివాసులు, ఇమ్మడి నర్సింలు, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీరామకృష్ణ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేయగా ఆశీర్వచనం చేసిన అర్చక స్వాములు తీర్థప్రసాదాలు అందజేశారు.

## సంకల్ప సిద్ధిశ్రీ వెంకటేశ్వర స్వామి మూలవిరాట్టుల ఊరేగింపు



రాజాపేట ఫిబ్రవరి 14 ( ప్రజా జ్యోతి) రాజపేట మండల కేంద్రం లో రేణిగుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి సంకల్ప సిద్ధిశ్రీ వెంకటేశ్వర స్వామి ఊరేగింపు కార్యక్రమం బుధవారం ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషములకు రేణిగుంట, బేగంపేట, నర్సాపురం, రాజాపేట గ్రామాలలో ఊరేగింపు కార్యక్రమం ఉదయము ఎనిమిది గంటల 8:30 నిమిషములకు స్వామి వారిని, పరివార దేవతల మూల విరాట్టు ల గ్రామోత్సవం ప్రారంభించడం జరుగుతుంది.

## మేడారం జాతరకు.. మిర్యాలగూడ డిపో నుండి 150 మంది సిబ్బంది.. 20 బస్సులు

**డిపో మేనేజర్ బి. పాల్**



మిర్యాలగూడ,ఫిబ్రవరి 13, ( ప్రజా జ్యోతి ): మేడారం మహా కుంభమేళ జాతరకు మిర్యాలగూడ ఆర్టీసీ డిపో నుంచి 20 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని,150 మంది సిబ్బంది విధుల్లో పాల్గొన నున్నారని డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. మంగళవారం డిపోలో విలేకరులతో మాట్లాడుతూ డ్రైవర్ 40 మంది, కండక్టర్లు 20 మంది, మెకానిక్ లు 6 మంది, ఈ నెల 16న కొత్తగూడెం ఆర్టీసీ డిపోకు రిపోర్ట్ చేస్తారని, వారందరూ అక్కడి నుంచి సమ్మక్క సారలమ్మ జాతరలో ఆర్టీసీ విధులలో హాజరవుతారని ఆయన తెలిపారు. మిర్యాలగూడ డిపో నుంచి మరో 40 మంది డ్రైవర్లు, కండక్టర్లు, వాలంటరీలుగా వరంగల్ ఆర్టీసీ డిపోలో రిపోర్ట్ చేస్తారని అక్కడి నుంచి వారు ఆర్టీసీ సేవలలో పాల్గొంటారని తెలిపారు. జాతరకు బస్సులు, సిబ్బంది వెళ్తున్న కారణంగా మిర్యాలగూడ డిపో పరిధిలోని ఇరికిగూడెం, తడకమళ్ళ, అడవిదేవులపల్లి, వీర్లపాలెం, కేశవపురం, తదితర గ్రామాలకు బస్సులు కొన్ని అందుబాటులో ఉండవన్నారు. మిర్యాలగూడ డిపో నుంచి విజయవాడ, హైదరాబాద్ తదితర నగరాలకు ఇతర ప్రాంతాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బస్సులు యధావిధిగా నడుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి సీఐ సంధ్యారాణి ఉన్నారు.

# ఈ నెల 16 సి.ఐ.టి.యు సమ్మెను జయప్రదం చేయండి



రాజాపేట, ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి): గత మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న అంగన్వాడీ ఉద్యోగుల వేతనాలు వెంటనే ఇవ్వాలనీ సి. ఐ. టి. యు. జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16 సమ్మె జయప్రదం కోరుతూ మంగళవారం రోజున రాజపేట మండలం సి. ఐ. టి. యు. జనరల్ బాడీ సమావేశం అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బూరుగు స్వప్న అధ్యక్షతన జరిగింది.

అనంతరం సమ్మె పోస్టర్ ను,నూతన సంవత్సర క్యాలెండర్ ను అవిష్కరించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరి మల్లేశం మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు వారి ఉద్యోగుల వేతనాలపైన మాత్రమే ఆధార పడి జీవనం సాగిస్తున్నారనీ,గతంలో ప్రతినెలా 14 వ తేదీ లోపు వేతానాలు వచ్చే వని వెంటనే ప్రభుత్వం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం ఐసిడియస్ ను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని నిధులలో కోత విధిస్తున్నదని విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి కార్మికులకు నష్టం చేసే విధానాలు అవలంబిస్తున్నదని ఎనిమిది గంటల పని విదానంను పన్నెండు గంటలకు వెసులుబాటు కల్పిస్తూ యాజమాన్యాలకు అనుకూలంగా 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికులకు నష్టం చేశారని తెలియజేశారు. మోడీ ప్రభుత్వం పెట్రోల్,డీజిల్, నిత్యావసర ధరలు రోజు రోజుకు పెంచుతూ పేదలపై బారాలు మోపుతూ నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16 న, జరిగే దేశ వ్యాప్త కార్మిక సమ్మె ను గ్రామీణ బంద్ నీ జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. లి

ఈ జనరల్ బాడీ సమావేశంలో పసుమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వడ్లకొండ వరలక్ష్మి,మిషన్ భగీరథ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్, అంగన్వాడీ యూనియన్ నాయకులు భూలక్ష్మి, శోభ,గౌరమ్మ,సరిత,మిషన్ భగీరథ యూనియన్ మండల అధ్యక్షులు అశోక్, మహేష్,మల్లేష్ ,సుజాత తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసు రుజువు కావడంతో.. నిందితుడికి యావజ్జీవ శిక్ష ఖరారు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13, (ప్రజాజ్యోతి): మద్యం మత్తులో ఖైని పెట్టలేదని తోటి కార్మికుడ్ని హతమార్చిన నిందితుడి నేరం రుజువు కావడంతో మంగళవారం ఐదవ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి. వేణు నిందితుడికి యావజ్జీవ శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు. వివరాల్లోకెళితే మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నూతనంగా నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ పనుల కోసం బీహార్, జార□ండ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. నిందితుడు బీహార్ రాష్ట్రం, రోహతక్ జిల్లా, నవాది గ్రామానికి చెందిన ఓం ప్రకాష్ గుప్తా, తోటి కార్మికుడైన జార□ండ్ రాష్ట్రం, బిస్వాపూర్ గ్రామానికి చెందిన రఘునందన్ రామ్ తో కలిసి గత సంవత్సరం ఏప్రిల్ 23 వ తారీఖున ప్లాంటు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఫుటుగా మద్యం సేవించాడు. అనంతరం ఖైని పెట్టలేదన్న నెపంతో హతమార్చాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన వాడపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ శిక్షను, 500 రూపాయల జరిమానాను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కొద్దికాలంలోనే నేరాన్ని రుజువు చేయడంలో ఎపిపి మనోహర్ రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ సైదులు,కోర్టు కానిస్టేబుల్ యూనస్,జానకి రాములు చొరవ చూపారని వారిని అభినందించారు.

## సింగారం పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



రాజపేట, ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి) :రాజపేట మండలంలోని సింగారం పాఠశాలలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు పెద్ది సిద్దయ్య స్నాక్స్ పంపిణీ చేశారు. తన 61వ, వివాహ దినోత్సవం పురస్కరించుకొని ఆయన పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కాసేపు గడిపి స్నాక్స్ పంపిణీ చేయగా పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలుపుతూ వివాహ దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్ పెద్ది సిద్దయ్యకు శుభాకాంక్షలు చెప్పారు.

## చిట్యాల మున్సిపల్ కమిషనర్‌గా వీరేందర్

చిట్యాల ఫిబ్రవరి 13(ప్రజాజ్యోతి) నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం చిట్యాల మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా పి. వీరేందర్ బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ నుండి చిట్యాలకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు.



# నల్లగొండ భారీ బహిరంగ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

**జాతీయ రహదారిపై విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య.**



ఆలేరు, ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి): కృష్ణ కృష్ణాజిల్లాలో తెలంగాణ వాటా పై స్పష్టత కోరుతూ భారత రాష్ట్ర సమితి నల్లగొండ పట్టణంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు మంగళవారం ఆలేరు మండలం నుండి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. భారీ బహిరంగ సభకు బయలుదేరే ముందు ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య మాట్లాడుతూ రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డు కు కృష్ణా జలాల పంపిణీ బాధ్యతలు అప్పగించి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులో నీటి ఎద్దడి ఎదురుకోనున్నదని, భవిష్యత్తులో తెలంగాణకు కృష్ణా జలాలు దక్కకుండా పోయే ప్రమాదం ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలతో తెలంగాణ నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. కెసిఆర్ ఆధ్వర్యంలో కృష్ణా జలాల సాధనకే జరుగుతున్న ఈ బహిరంగ సభతో కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలని, కెసిఆర్ పై అక్కసుపూరితంగా వ్యవహరించడం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## బంగారం చోరీ

**చాకచక్యంగా చేదించిన పోలీసులు**





పెన్ పహాడ్ మండలం ఫిబ్రవరి 13(ప్రజా జ్యోతి): బంగారం దొంగతనం కేసును చాకచక్యంగా చేదించిన పెన్ పహాడ్ ఎస్సై పెరిక రవీందర్ ను,పోలీసు సిబ్బందిని. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, సిఐ అశోక్ రెడ్డి వారిని అభినందించారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని చీదేళ్ల గ్రామంలో వంగవీటి శ్రవణ్ కుమార్ 25 మే 2023 తేదీన ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లగా,అదే గ్రామానికి చెందిన గొబ్బి సందీప్ (24) తండ్రి కాంతయ్య , రెడపంగి యశ్వంత్ (19) తండ్రి నాగార్జున ఇరువురు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న నగలను దొంగతనంచేశారు. ఆ నగలను ఇంట్లో పెట్టుకుని వెంటనే అమ్మితే అందరికీ అనుమానం వస్తుందని, కొద్ది రోజులు గడిచిన తర్వాత అమ్ముదాం అనుకొని సూర్యాపేటలో అమ్ముటకు వెళ్తుండగా మాచారం గ్రామ శివారులో పొట్లపాడు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు పోలీసులు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్ పై చాలా వేగంగా వెళుతుండగా ఎస్సై,పోలీస్ సిబ్బంది ఆపుతున్న ఆపకుండా స్పీడుగా వెళుతుండగా అనుమానం వచ్చి వెంబడించి పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా మోటార్ సైకిల్ నడిపే వ్యక్తి పాయింట్ జేబులో ఒక ప్లాస్టిక్ సంచి ఉన్నది. అందులో చూడగా బంగారం,నగలు ఉన్నవి పోలీసులు వారి ని అదుపులోకి తీసుకొని వారిని విచారించగా వారు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద ఉన్న మోటార్ సైకిల్,రెండు బంగారు గొలుసులు, మూడు చెవిదిద్దులు, రెండు ఉంగరాలు, బంగారు బిస్కెట్, మొత్తం 75 గ్రాముల బంగారం, బజాజ్ ప్లాటిన మోటార్ సైకిల్ ని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ కి పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ మచ్చ ప్రవీణ్, తురక లింగయ్య, జాటోత్ రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు మొత్తం ఓటర్లు 9,96,823

సూర్యాపేట కలెక్టరేట్,ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి):త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు గాను సూర్యాపేట జిల్లాలో ఫిబ్రవరి 8 నాటికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,96,823 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.సూర్యాపేట జిల్లాలో సాధారణ ఓటర్లు 9,96,244 మంది ఉండగా పురుషులు 4,87,435,స్త్రీలు 5,08,755,ట్రాన్స్ జెండర్లు 54 మంది ఉన్నారు.హుజూర్నగర్ నియోజకవర్గంలో పురుషులు 1,21,390,స్త్రీలు 1,28,692,ట్రాన్స్జెండర్లు 17 మొత్తం 2,50,099 మంది,కోదాడలో పురుషులు 1,19,295,స్త్రీలు 1,25,889,ట్రాన్స్ జెండర్లు 17 మొత్తం 2,45,201 మంది,సూర్యాపేట నియోజకవర్గంలో పురుషులు 1,18,510,స్త్రీలు 1,24,422,ట్రాన్స్ జెండర్లు 13 మొత్తం 2,42,945 మంది,తుంగతుర్తిలో పురుషులు 1,25,240,స్త్రీలు 1,29,752,ట్రాన్స్జెండర్లు 7 మొత్తం 2,57,999 మంది ఉన్నారు.సర్వీస్ ఓటర్లు జిల్లాలో 475 మంది ఉండగా 459 మంది పురుషులు 19 మంది స్త్రీలు ఉన్నారు.హుజూర్నగర్ లో 107 మంది పురుషులు,9 మంది స్త్రీలు మొత్తం 116 మంది,కోదాడలో 115 మందిలో 110 పురుషులు,5 స్త్రీలు,సూర్యాపేటలో 101 మందిలో పురుషులు 98, 3 స్త్రీలు,తుంగతుర్తిలో 146 మందిలో 144 పురుషులు,2 స్త్రీలు ఉన్నారు.ఎన్ఆర్ఐ ఓట్లు జిల్లాలో 101 ఉండగా 82 మంది పురుషులు,19 మంది స్త్రీలు ఉన్నారు.హుజూర్నగర్లో ఎన్ఆర్ఐలు 34 మంది ఉండగా పురుషులు 26,మహిళలు 8,కోదాడలో 34 మంది ఉండగా పురుషులు 26,మహిళలు 8 మంది,సూర్యాపేటలో 25 మంది ఉండగా పురుషులు 22,స్త్రీలు 3,తుంగతుర్తిలో 8 మంది పురుష ఓటర్లు ఉన్నారు.మొత్తంగా సాధారణ ఓటర్లు,సర్వీస్ ఓ టర్లు,ఎన్ఆర్ఐ ఓటర్లు కలుపుకొని 9,96,823 మంది ఓటర్లు ఉండగా అందులో 4,87,902 మంది పురుషులు,5,08,774,మంది స్త్రీలు,54 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు.

## కార్పొరేట్ విధానాలతో రైతులకు పేదలకు నరకం చూపిస్తున్న మోడీ

**ఇంటింటి ప్రచారం లో భాగంగా ఆలేరులో ఎండి జహంగీర్.**



ఆలేరు, ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పోరేట్ విధానాలతో దేశంలో రైతులు పేద ప్రజలు నరకం అనుభవిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం డి జహంగీర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలేర్ పట్టణంలో ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలైన ఆదాని, అమ్మానీలకు దేశ సంపదను దోచిపెడుతూ పేదలను మరింత పేదలుగా తయారు చేస్తున్నదని అన్నారు. గతంలో తీసుకువచ్చిన రైతన్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించిన సందర్భంగా రైతులపై పలు కేసులు నమోదు చేసిందని, వాటిని వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చిన మోడీ వాటిని అమలు చేయకపోవడంతో రైతాంగం కదము తొక్కిందని, ఢిల్లీకి వస్తున్న రైతులపై నాటి చార్జి భాష వాయు ప్రయోగాలతో వారిని అడ్డుకుంటూ అంచి వేయడానికి ప్రయత్నం చేస్తున్నదనీ దీన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్న రైతులపై దాడి చేయడం నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తొత్తిగా మారిందనానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలని ప్రశ్నించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో ప్రధాని మోడీకి పరాభవం తప్పదని అన్నారు. ఇంటింటికి సిపిఎం కార్యక్రమంలో భాగంగా ఆలేరు పట్టణంలోని సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలో గడపగడపకు తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు రేషన్ కార్డులు లేవని, అద్దె ఇల్లుల్లో ఉంటున్నామని ఇంటి స్థలాలు కావాలని, మురికి కాలువల నిర్వహణ, దోమల, కోతుల, కుక్కల కట్టడికి మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఈ ప్రచారంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు ఎంఏ ఇక్బాల్, మండల కార్యదర్శి ధూపాటి వెంకటేష్, నాయకులు సూదగాని సత్య రాజయ్య, ఘనగాని మల్లేష్, మోడీ గాడి రమేష్, తాళ్లపల్లి గణేష్, భువనగిరి గణేష్, కాసుల నరేష్, చెన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ సభకు భారీగా తరలిన రాజాపేట టిఆర్ఎస్ శ్రేణులు



రాజాపేట, ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి): ఎన్నికల తర్వాత మొట్టమొదటిసారిగా నల్గొండ లో నిర్వహిస్తున్న టిఆర్ఎస్ భారీ బహిరంగ సభకు రాజపేట మండలం నుండి అధికంగా శ్రేణులు తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాలలో అన్ని గ్రామాల నుండి ఉత్సాహంగా బయలుదేరారు. రాజపేట మండల పార్టీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్ కుమార్, జాల తాజా మాజీ సర్పంచి గుంటి మధుసూదన్ రెడ్డి, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం మండల శాఖ అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య, యువజన విభాగం మండ ల శాఖ అధ్యక్షులు పల్లె సంతోష్ కుమార్ గౌడ్, కటకం స్వామి, ఎర్ర గోకుల జస్వంత్, పిఏసిఎస్ చైర్మన్ చింతల పూరి భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

## జిల్లా అవార్డు అందుకుని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జకారియా స్కూల్ విద్యార్థిని మెర్సీ



రాజాపేట, ఫిబ్రవరి 13 (ప్రజా జ్యోతి) జాతీయ సైన్స్ దినోత్సవము సందర్భంగా టి. ఎస్. సి. ఓ. ఎస్. టి %ు% ఇ. పి. టి. ఆర్. ఐ. ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జరిగిన పోటీలో పోయెట్రీ( సేఫ్ వాటర్) లో రాజాపేట మండలం జాల గ్రామంలోని జకారియా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ తరుపున 9వ తరగతి విద్యార్థిని ముక్కెర మెర్సీ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందారు. విద్యార్థిని, ఉపాధ్యాయురాలిని పాఠశాల యాజమాన్యం బిషప్ జాన్ గొల్లపల్లి మరియు తిమోతి డెక్సర్ గొల్లపల్లి లు అభినందించారు. ఈనెల 25వ, తేదీన రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అయిన సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం చాల గర్వకారమన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలో కూడ మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని మెర్సీ ని గైడ్ ఉపాధ్యాయురాలు ఉపేంద్రను ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి కోరారు , ఈ సందర్భంగా మెర్సీ నీ గైడ్ టీచర్ ఉపేంద్ర ను సన్మానించి అభినందించారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బధిరుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం దుస్తుల పంపిణీ

సూర్యాపేట రూరల్ ఫిబ్రవరి 13(ప్రజాజ్యోతి): సూర్యాపేట యుద్ధవీరుడు కల్నల్ సంతోష్ బాబు 41 జయంతి సందర్భంగా సూర్యపేట శివారు కసరాబాద్ రోడ్డు నా గల సంతోష్ బాబు స్ఫూర్తి స్థలం నందు సంతోష్ బాబు విగ్రహానికి వారి తల్లిదండ్రులు ఉపేందర్ మంజుల పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మూగ చెవిటి అపూర్వ బధిరుల పాఠశాలలో 65 మంది విద్యార్థులకు అన్నదానం మరియు దుస్తులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు మదనాచారి యామా దయాకర్ గుండా రమేష్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు



# గుండ్లగూడెం గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి

**రైల్వే సీనియర్ సెక్షన్ ఆఫీసర్ కి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు**



ఆలేరు, ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి):ఆలేరు మండలంలోని గుండ్లగూడెం,పటేల్ గూడెం, శ్రీనివాస పురం గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆలేరు పట్టణంలోని రైల్వే సీనియర్ సెక్షన్ అధికారికి వినతి పత్రం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలేరు పట్టణానికి సమీపంలో ఉన్ గుండ్లగూడెం గేట్ వద్ద గత ఆరు రోజులుగా రైల్వే ట్రాక్ మరమ్మత్తుల పనులు జరుతున్నాయని, దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పట్టణానికి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, మూడు గ్రామాల చెందిన ప్రజలకు రవాణా వ్యవస్థ నిలిచిపోవడంతో సకాలంలో వైద్య సేవలు అందక ఇటీవల ఒక మహిళ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇచ్చిన సమయం వరకు పనులు పూర్తి చెయ్యకుండా ఇంకా రైల్వే గేట్ ని తియ్యడం లేదని రైల్వే ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తూ ఆలేర్ రైల్వే స్టేషన్ సమీపంలో నున్న సీనియర్ సెక్షన్ ఇంచార్జ్ కి వినతిపత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే శాశ్వత పరిష్కారం కోసం గుండ్లగూడెం గేట్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మించాలని రైల్వే అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

**జెఈఈ మెయిన్స్ లో 99.75 మార్కులతో జయ జూనియర్ కాలేజి టాపర్**

## కందిబండ వెంకటేష్




సూర్యాపేట టౌన్ ఫిబ్రవరి 13(ప్రజాజ్యోతి):జెఈఈ మెయిన్స్ ఫలితాలలో సూర్యాపేట పట్టణా నికి చెందిన కిరాణ దుకాణం నడిపే మద్యతరగతి కుటుంబం నుండి వచ్చిన కందిబండ కిరణ్ కుమారుడు కందిబండ వెంకటేష్ 99.75 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు.జయ స్కూల్ నందు పదవ తరగతి వరకు చదివి,జయ జూనియర్ కాలేజి నందు ఎంపిసి గ్రూప్ లో చదివిన ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన కందిబండ వెంకటేష్ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడు ఐఐటి సాధించాలనే పట్టుదలతో కష్టపడి చదివి విజయం సాధించాడని,జయ జూనియర్ కాలేజి అధ్యాపక బృందం,డైరెక్టర్ ల ప్రోత్సాహంతో కాలేజ్ టాపర్ గా నిలిచా రని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు కందిబండ వెంకటేష్ కు అభినందనలు తెలిపారు.



## ఆధ్యాత్మిక కేంద్రంగా ఎర్రవరం ఆలయం

కోదాడ రూలర్ ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి ): ఎర్రవరం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా కృషి చేస్తాం ఎర్రవరం ఆలయంలో జెసి వెంకట్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు కోదాడ మండలంలోని ఎర్రవరం గ్రామంలో శ్రీ దూబగుంట లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లడం ఈ ప్రాంత వాసులకు శుభసూచకమని సూర్యాపేట జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా తన వంతు సహకారం అందిస్తానన్నారు. చారిత్రాత్మక ఆలయాలను ప్రభుత్వం పరిరక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ స్థానిక అధికారులు పాల్గొన్నారు



## హెచ్పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి

**ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్**



సూర్యాపేట రూలర్ ఫిబ్రవరి 13(ప్రజాజ్యోతి ) : సూర్యాపేట రూరల్ పరిధిలోని ఇమా%శీ%పేటలో ఉన్న హెచ్పిసిఎల్ టెర్మినల్ లో పనిచేస్తున్న ట్యాంకర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా సమయపాలన లేకుండా వెట్టిచాకిరి చేపిస్తున్న యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆయిల్ టాంకర్స్ %�д% డ్రైవర్స్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం సమ్మె రెండవ రోజు ప్రారంభమైంది కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసే పరిస్థితి యాజమాన్యం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. సమయపాలన లేకుండా తంబు విధానాన్ని ప్రవేశపెట్టి డ్రైవర్ల యొక్క జీవితాలతో ఆడుకుంటున్నారని వారి యొక్క లోడింగ్ అన్ లోడింగ్ సాంకేతిక సమస్యలు వచ్చినప్పటికీ వాటిని పరిష్కరించకుండా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లను ఎలాంటి నోటీసులు లేకుండా వారి ఇష్టానుసారంగా తొలగించడం ఇదేమిటి అని అడిగితే సాటి డ్రైవర్లను కూడా తొలగించే పరిస్థితి యాజమాన్యం వచ్చిందని అన్నారు. యాజమాన్యం ఆటవిక ఆలోచనలతో కార్మికుల యొక్క కనీస వసతులు తీర్చలేని హిందుస్థాన్ పెట్రోల్ లిమిటెడ్ యాజమాన్యం మరియు ట్రాన్స్పోర్ట్ యాజమాన్యం తక్షణమే స్పందించి వారి సమస్యలకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమ్మె సమస్యలు పరిష్కారం వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు గుగులోతు రాజారాం, యూనియన్ అధ్యక్షులు ఎండి బాబా, ప్రధాన కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు సాయిబాబా ఎడెలి శ్రీకాంత్ కోశాధికారి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఎస్.కె పాషా, సైదులు, హరి, శ్రీకాంత్ లింగయ్య, దీకొండ శ్రీనివాస్, పెండ్ర కృష్ణ వివిధ రంగాల కార్మిక నాయకులు ఈ సమ్మెకు సంఘీభావంగా మద్దతు పలికినారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

**సిసి రోడ్ల నిర్మాణంకు శంకుస్థాపన ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి**



చౌటుప్పల్ ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి): మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ముందుకెళ్తున్నారని ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళ వారం ధర్మాజీగూడెం గ్రామంలో హెచ్ఎండిఏ నిధులు రూ.50 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.8 లక్షలతో వ్యయం తో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ తాడూరు వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జిల్లా ఈశ్వరమ్మ వెంకటేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి,మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లంబోతు నారాయణ, బత్తుల శ్రీహరి, రాచకొండ భార్గవ్, జువ్వి నరసింహ,ఉదరి శ్రీనివాస్,ఎంపీడీవో సందీప్ కుమార్,పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, కొంతం పద్మ, ఐతరాజు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో కాంగ్రెస్ వినూత్న నిరసన

మొదటి పేజీ తరువాయి...

కూడా కాంగ్రెస్ పార్టీ అన్నిస్థానాల్లో విజయం సాధిస్తుందని అన్నారు.

కెసిఆర్ మోసాలు చూసి ప్రజలు సిగ్గుపడుతున్నారు: గుమ్ముల మోహన్ రెడ్డి

కెసిఆర్ మోసాలు చూసి జిల్లా ప్రజలు సిగ్గుపడుతున్నారని నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు. నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, దత్తత తీసుకొని నల్లగొండలో అభివృద్ధి చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలు చేసి ప్రజలను నమ్మించిన కేసీఆర్ ఏ ముఖం పెట్టుకొని నల్లగొండకు వస్తాడని నిలదీశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విధంగా కేసీఆర్ ముక్కు నేలకు రాసి నల్లగొండలో అడుగుపెట్టి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల త్యాగాలు చూసి సోనియాగాంధీ తెలంగాణ ఏర్పాటు చేస్తే కేసీఆర్ దొరల పాలన సాగించాడని విమర్శించారు. కెసిఆర్ ప్రజలకు ఏ మాయమాటలు చెప్పినా ఇంకా నమ్మే స్థితిలో లేరని అన్నారు.బీఆర్ఎస్ గల్లీ పార్టీ అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ హయాంలో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో పాలన సాగించిందే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు.తాగు,సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు.పదేళ్ల అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధి పనులు చేయని కెసిఆర్ రాజకీయ లబ్ధి కోసమే నల్లగొండలో బహిరంగ సభ పెట్టారని విమర్శించారు. కెసిఆర్ పాలనలో నల్లగొండ జిల్లా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులతో పాటు అభివృద్ధి పనులంటిని పూర్తి చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్దె సుమన్ మాట్లాడుతూ...... కెసిఆర్ పాలనలో ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు స్వాహా చేశారని విమర్శించారు. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పిన కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూకూరి రమేష్, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, డిసిబిబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,కనగల్ మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేఖల భద్రాద్రి, కౌన్సిలర్లు,ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు బషీర్, కరుణాకర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి, సమద్, జూలకంటి శ్రీనివాస్, కత్తుల కోటి, ఇంతియాజ్, మహమ్మద్ మహబూబ్ అలీ, జూలకంటి సైదిరెడ్డి, బీరం కరుణాకర్ రెడ్డి, గురిజ వెంకన్న, వంగాల అనిల్ రెడ్డి ,ఇబ్రహీం, చింత యాదగిరి, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, పాదం అనిల్, దుబ్బరూప అశోక్ సుందర్, ప్రకాష్ రెడ్డి, బుర్రి రజిత యాదగిరి, నంద్యాల వీర బ్రహ్మానంద రెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి, నల్లగొండ అశోక్, భాస్కర్, ఏర్పుల అశోక్, గడిగ శ్రీనివాస్, కయ్యుం బాబా, ఖలీల్, సుంకు ధనలక్ష్మి, పాదం అనిల్, ఇటికాల శ్రీనివాస్, షేక్ జహంగీర్ బాబా, పున్న పవన్ కుమార్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు ఎన్ఎస్యుఐ,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# ప్రమాద ఘటికలు మోగిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు!


మొదటి పేజీ తరువాయి...

వెంట ప్రమాదకర పరిస్థితుల్లో ట్రాన్స్ ఫార్మర్లు ఉన్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ట్రాన్ఫార్మర్స్ పేలి ప్రజలు మృత్యువాత పడ్డ సంఘటనలు ఉన్నాయి. పాఠశాలలకు వెళ్లేదారుల వద్ద,మూలమలుపుల వద్ద,బ్యాంకులవద్ద,నిత్యం రద్దీగా ఉండేచోట విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ప్రమాద ఘటికలు మోగిస్తున్నాయి. ట్రాన్స్ ఫార్మర్ల వద్ద కంచెలను ఏర్పాటు చేయకపోవడంతో దారి వెంట నడవాలంటే ప్రజలు జంకుతున్నారు.స్థానిక నిడమనూరు మండలకేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేసి రక్షణ కల్పించడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్ ఫార్మర్లకు ఎటువంటి రక్షణ లేకపోవడంతో ఎప్పుడు ఏలాంటి ప్రమాదం తరుముకోస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ప్రమాదం అంచున ప్రయాణాలు....**

నిడమనూరు మండల కేంద్రంలో బొడ్రాయి నుంచి ఎంపిడివో, పోలీస్ స్టేషన్ కు వెళ్లే దారిలో బొడ్రాయి వద్ద, కోర్ట్ భవనం వెనుక వైపున తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రాథమిక పాఠశాల వెనక వైపున ట్రాన్స్ ఫార్మర్ .అదేవిధంగా రాజన్నగూడెం నుంచి పార్వతీ పురం,రాజన్నగూడెం నుంచి నిడమనూరు,బంకాపురం-వెనిగండ్ల ,వెనిగండ్ల-సూరేపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంట రైతులు వ్యవసాయ మోటార్ల కోసం ట్రాన్స్ ఫార్మర్లు అమర్చారు.కానీ వాటికీ ఎక్కడ చూసినా కనీసం రక్షణ కంచెను ఏర్పాటు చేపట్టకపోవడంతో పలువురు ఆరోపించారు .ఇలా చాలా చోట్ల సీసీ రోడ్ల వెంట ప్రమాదకర పరిస్థితిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లకు ఉన్నాయని. వీటికి రక్షణ కల్పించవలసిన బాధ్యత అధికారులపై ఉన్నా..తమకేమీ పట్టనట్లు అధికారులు ఉన్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధికారులు రక్షణ కంచెను ఏర్పాటు చేయడంలో వారి నిర్లక్ష్య వైఖరికి సజీవసాక్ష్యాలుగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజలు మాత్రం ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియక అమాయకంగా ప్రమాదం అంచున ప్రయాణాలు సాగిస్తున్నారు.







# తొలి ప్రేమకు పదేళ్లు.. ప్రేరణ కలిగిస్తున్న జంటలు..

నిడమనూరు,ఫిబ్రవరి13(ప్రజాజ్యోతి):గుండెల్లో దాచుకున్న ప్రేమ.. మాటల్లో చెప్పలేని భావాలను వెల్లడించే ప్రేమికుల రోజు రానే వచ్చింది.జాతి,కుల, మత, వర్గ,భాష, ప్రాంతీయ,భేదాల్లేనిది ప్రేమ.నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా...అది ఎలా పుట్టింది.. దాన్ని పండుగలా జరుపుకోవడం పై "ప్రజాజ్యోతి" ప్రత్యేక కథనం.

-వాలెంటైన్స్ డే చరిత్ర : ప్రేమికుల రోజు పుట్టడానికి ఆద్యుడు వాలెంటైన్ రోమ్‌కి చెందిన ఆయన క్రీస్తుపూర్వం 270లో యువతకు ప్రేమ సందేశాలు ఇవ్వడం, ప్రేమ వివాహాలను ప్రోత్సహించడం చేశాడు. దీని వల్ల యువత వాలెంటైన్ ను ఆరాధించేవారు. అదే సమయంలో రోమ్ చక్రవర్తి క్లాడియస్ కూతురు ఆయనకు అభిమానిగా మారడంతో చక్రవర్తికి భయం పట్టుకుంది. యువతకు ప్రేమ సందేశాలిచ్చి, తప్పుదోవ పట్టిస్తున్నాడన్న కారణం చూపి, వాలెంటైన్‌కు మరణశిక్ష ప్రకటించి.. ఫిబ్రవరి 14న ఉరి తీయించాడు. ఇది జరిగిన రెండు దశాబ్దాల తర్వాత అప్పటి పోప్ గెలిసియన్స్%ా% వాలెంటైన్ చనిపోయిన రోజును ప్రేమికుల దినోత్సవంగా ప్రకటించారు. అప్పటినుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ రోజును ప్రేమికుల పండుగలా జరుపుకుంటున్నారు.

-ప్రేమను వ్యక్తపరిచే వారం : ప్రేమికుల రోజుకు వారం ముందు నుంచి ప్రేమికుల వారం జరుగుతుంది. ఇందులో ప్రేమికులు తమ అనుబంధాన్ని పెంచుకునేందుకు గులాబీలు ఇచ్చి.. ప్రపోజ్ చేసుకుంటారు. గిఫ్టులుగా చాకెట్లు, టెడ్డీబేర్లు ఇస్తారు. ప్రామిస్ చేసి, ముద్దు ద్వారా ప్రేమను తెలియజేస్తారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని, తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. వారం తర్వాత 8వ రోజున ప్రేమికుల రోజు జరుపుకొని ఎంజాయ్ చేస్తారు.

**-తొలిప్రేమ.. పదేళ్లకు పెళ్లి..**

నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని బంకాపురం గ్రామానికి చెందిన బండారు వెంకటయ్య,వెంకమ్మ దంపతుల చిన్న కుమారుడు నరేష్, నల్లగొండ జిల్లా పానగల్ కు చెందిన కొత్తపల్లి రమణయ్య జానమ్మ దంపతుల చిన్న కుమార్తె ప్రవంతి లు కలిసి నల్లగొండలో 2010లో పీజీ చదువుతుండగా 2010జూన్ 10న వీరికి మొట్టమొదటిసారి తొలి పరిచయం..తొలిచూపులోనే ప్రేమ మొదలైంది. కానీ లైఫ్ సెట్ అయ్యే వరకూ పెళ్లి చేసుకోకూడదని ప్రామిస్ చేసుకున్నారు. 2013న ప్రస్తుతం ఇద్దరూ ప్రభుత్వోద్యోగులు చేస్తున్నారు. ఇప్పుడు ఈ జంట ప్రస్తుతం ఒకరు కేజీబివి స్కూల్ టీచర్ గా,మరొకరు ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ దంపతులు ఇద్దరు స్థిరపడి ప్రభుత్వ ఉద్యోగ రంగంలో ఉంటూ అందరూ ఒప్పుకోవడంతో 2014లో నల్లగొండ జిల్లా పానగల్ లో వీరి పెళ్లి అంగరంగ వైభవంగా జరిగింది.ప్రస్తుతం వీరికి ధీరజ్ ,దేవాన్ష్ ఇద్దరు కుమారులు జన్మించారు.



